# పోలీసు అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దాం



పోలీసు అమవీరులకు సెల్యూట్ చేస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా, జిల్లా న్యాయమూర్తి రాధాదేవి, కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, గ్రేటర్ కమిషనర్ రిజ్వాన్, పోలీసు అధికారులు

- ఫ్లాగ్ డే కార్యక్రమంలో సీపీ అంబర్ కిశోర్ ఝా
- అశోకా జంక్షన్ నుంచి కమిషనరేట్ వరకు కవాతు
- కమిషనరేట్‌లో అమవీరులకు శ్రద్ధాంజలి ఘటించిన న్యాయమూర్తి, కలెక్టర్లు, గ్రేటర్ కార్పొరేషన్ కమిషనర్

సుబేదారి, అక్టోబర్ 21 : పోలీసు అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దామని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా (ఫ్లాగ్ డే) శనివారం కమిషనరేట్‌లోని పోలీసు అమరవీరుల స్తూపం వద్ద సీపీ, వరంగల్ జిల్లా న్యాయమూర్తి రాధాదేవి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు సిక్తాపట్నాయక్, ప్రావీణ్య, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్, డీసీపీలు, ఏసీపీలు అమవీరుల కుటుంబ సభ్యులు శ్రద్ధాంజలి ఘటించారు. అంతకుముందు సీపీ, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది అశోకా జంక్షన్ నుంచి కమిషనరేట్ వరకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సమాజం కోసం ఎంతో మంది పోలీసులు తమ ప్రాణాలను త్యాగం చేశారని, వారిని ప్రజలు ఎల్లప్పుడూ గుర్తుపెట్టుకోవాలని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, వారికి ఎలాంటి సమస్య వచ్చిన అండగా ఉంటామన్నారు. ప్రజల్లో మంచి పేరు రావాలంటే నీతి నిజాయితీతో పనిచేయాలని సిబ్బందికి సూచించారు. 189 మంది పోలీసు అమరవీరుల పేర్లను డీసీపీ మురళీధర్ చదివి వినిపించారు.



పోలీసు అమవీరుల స్తూపం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న కుటుంబ సభ్యులు

## 27న మహబూబాబాద్‌కు సీఎం కేసీఆర్

- శనిగపురం వద్ద నియోజకవర్గ ప్రజాఆశీర్వాద సభ
- ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యే శంకర్‌నాయక్
- పెద్దసంఖ్యలో ప్రజలు తరలిరావాలని పిలుపు
- బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్ నింపనున్న సభ.. ఊపందుకోనున్న ప్రచారం

మహబూబాబాద్, అక్టోబర్ 21(నమస్తే తెలంగాణ) : మహబూబాబాద్ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ రానున్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే శంకర్ నాయక్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ నెల 27న మహబూబాబాద్ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొననున్నారు. శనివారం రాత్రి మంత్రి, ఎమ్మెల్యేతో పాటు పలువురు నాయకులు మానుకోట పట్టణంలోని శనిగపురం వద్ద సభాస్థలిని పరిశీలించారు. కాగా, సీఎం కేసీఆర్ రాకతో గులాబీ శ్రేణుల్లో మరింత జోష్ పెరుగనుంది. ఇప్పటికే మహబూబాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి శంకరనాయక్ నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దీనికి తోడు సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొనేందుకు వస్తుండడంతో బీఆర్‌ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకు చెందిన ముఖ్య నేతలతో పాటు నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి సభలో మాట్లాడనున్నారు.

## భూపాలపల్లిలో బంగారం, నగదు పట్టివేత

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 21 : భూపాలపల్లిలోని కమలాపూర్ క్రాస్ రోడ్డు వద్ద శనివారం సాయంత్రం భూపాలపల్లి సీఐ రాం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై శ్రావణ్ కుమార్ వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీలో నల్ల రవి వద్ద రూ.1.50లక్షలు, సాద సురేందర్ రెడ్డి వద్ద 165 గ్రాముల బంగారు అభరణాలు లభించగా, సీజ్ చేశారు. వాటిని భూపాలపల్లి రిటర్నింగ్ ఆఫీసర్‌కు అప్పగించినట్లు తెలిపారు.

## గ్యాస్ కనెక్షన్ ఇస్తానంటూ వృద్ధురాలికి టోకరా..

### రూ.2 వేలతో ఉడాయించిన కేటుగాడు



మోసపోయిన వృద్ధురాలు మల్లమ్మ

లింగాలఘనపురం, అక్టోబర్ 21 : అవ్వా.. బాగున్నవా.. నీకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్ వచ్చింది.. అంబేద్కర్ విగ్రహం దగ్గర సిలిండర్ల ఆటో ఉంది.. తీసుకెళ్తువురా.. అంటూ.. ఓ వ్యక్తి రూ. 2 వేలు ఎత్తుకెళ్లిన ఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. లింగాలఘనపురంలో నివాసముంటున్న రాగళ్ల మల్లమ్మ ఇంటికి ఓ అపరిచితుడు వచ్చి మాట కలిపాడు. గ్యాస్ పథకంలో కొత్త కనెక్షన్ మంజూరయిందని, రూ. 2 వేలు సదరు కంపెనీకి చెల్లించాలని నమ్మించాడు. సిలిండర్లు ఉన్న ఆటో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిలిపామన్నాడు. తయారై అక్కడికి రా. ఫొటోలు కూడా తీసుకోవాలి.. అంటూ ఓ కాగితంపై పిచ్చి గీతలు గీసి.. ఆ చిట్టీని మల్లమ్మ చేతిలో పెట్టి, రూ. 2 వేలు తీసుకుని ఉడాయించాడు. మల్లమ్మ అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లగా అక్కడ ఆటో లేకపోవడంతో రాత్రి వరకూ వేచి చూసింది. అయినప్పటికీ రాకపోవడంతో తాను మోసపోయానని గ్రహించి లబోదిబోమంటున్నది.

## కారు బైక్ ఢీ.. ఒకరి మృతి

వెంకటాపూర్, అక్టోబర్ 21 : మండలంలోని లింగాపూర్ గ్రామంలో కారు బైక్ ఢీకొని ఒకరు మృతి చెందారు. ఎస్సై చల్ల రాజు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన మోరె చందర్‌రావు తన కుటుంబంతో కలిసి కారులో మేడారం వచ్చి వెళ్తున్నాడు. జంగాలపల్లి గ్రామానికి చెందిన మోతె చార్లెస్ రాజు(55) తన మనుమరాలు ప్రవళిక (7) జంగాలపల్లి గ్రామానికి చెందిన జగన్నాథం జైపాల్(8)ని బైక్‌పై ఎక్కించుకుని మచ్చాపూర్ గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో లింగాపూర్ క్రాస్ వద్ద కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో చార్లెస్ రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో ఎంజీఎం దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### వాహనం ఢీకొని మరొకరు..

నర్సింహులపేట : వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని పెద్దనాగారం సమీపంలో జాతీయ రహదారిపై శనివారం జరిగింది. ఎస్సై జీ సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారిపై తెల్లవారు జామున నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని దవాఖానకు తరలించినట్లు తెలిపారు.




ప్రమాదానికి కారణమైన కారు



ప్రమాదంలో దెబ్బతిన్న బైక్

## ఈ దంపతులు 1900లో పుట్టారట..!

- ఓటర్ కార్డులో తప్పుగా ముద్రించిన భారత ఎన్నికల సంఘం
- ఇద్దరి పుట్టిన తేదీ 1-1-1900గా ముద్రణ
- సవరించాలని అధికారులకు భార్యాభర్తల మొర




భారత ఎన్నికల సంఘం జారీ చేసిన కార్డులను చూపిస్తున్న కోడెపాక కోటిలింగం-పద్మ దంపతులు

కమలాపూర్, అక్టోబర్ 21 : మండల కేంద్రానికి చెందిన కోడెపాక కోటిలింగం- పద్మ దంపతులు 1900లో జన్మించినట్లు భారత ఎన్నికల సంఘం ఐడీ కార్డు జారీ చేసింది. ఎన్నికల ఐడీ కార్డులో భార్యభర్తల జన్మదినం తప్పుగా నమోదు చేసింది. భార్యాభర్తలు 1-1-1900లో జన్మించినట్లు ఉన్నది. కోటిలింగం 1 జూలై 1979, పద్మ 20 జనవరి 1980లో జన్మించగా, ఐడీ కార్డులో తప్పుగా ముద్రించారని, సరిచేయాలని తహసీల్ కార్యాలయంలో నెల రోజుల క్రితం ఫిర్యాదు చేశామని శనివారం ఆ దంపతులు చెప్పారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా సరిచేయాలని వేడుకున్నారు.



ELECTION COMMISSION OF INDIA
UJT2217040
Name: Kotilingamu Kodepaka
Father's Name: Uppalaiah
Gender: Male
Date of Birth / Age: 01-01-1900

కోడెపాక కోటిలింగం, పద్మ ఓటర్ ఐడీ కార్డుల్లో జన్మదినం తప్పుగా ముద్రించిన భారత ఎలక్షన్ కమిషన్



ELECTION COMMISSION OF INDIA
UJT2217479
Name: Padma Kodepaka
Husband's Name: Kotilingamu
Gender: Female
Date of Birth / Age: 01-01-1900




కాజీపేట రైల్వేస్టేషన్ వద్ద కేంద్ర పోలీస్ బలగాలు

## కాజీపేటకు చేరుకున్న కేంద్ర బలగాలు

కాజీపేట, అక్టోబర్ 21 : కాజీపేట రైల్వే జంక్షన్‌కు శనివారం ఉదయం కేంద్ర పోలీస్ బలగాలు చేరుకున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం జిల్లాలో ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మందస్తుగా కేంద్ర పోలీసు బలగాలను రప్పించారు. అస్సాం రాష్ట్రానికి చెందిన 12 కంపెనీలకు చెందిన తొమ్మిది వందల మంది పోలీసు బలగాలు ప్రత్యేక రైలులో తరలివచ్చారు. కాజీపేట రైల్వే జంక్షన్‌లో దిగిన ఈ అస్సాం బలగాలను జిల్లా పోలీస్ అధికారులు వివిధ జిల్లాలకు పలు వాహనాల్లో తరలించారు.

## 28న కాళేశ్వర ఆలయం మూసివేత

కాళేశ్వరం, అక్టోబర్ 21 : దక్షిణ కాశీగా పేరుగాంచిన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయం, అనుబంధ ఆలయాలను ఈ నెల 28న చంద్ర గ్రహణం సందర్భంగా మూసి వేయనున్నట్లు ఆలయ ముఖ్య అర్చకుడు పనకంటి ఫణీంద్ర శర్మ తెలిపారు. 28న మధ్యాహ్నం స్వామి వార్లకు నైవేద్యం పెట్టి, ఆలయాన్ని బంధనం చేసి 1.30 గంటలకు మూసివేస్తారన్నారు. 29న ఉదయం 4.30 గంటలకు ఆలయాన్ని తెరిచి సంప్రోక్షణ పూజలు చేసి భక్తులకు ఉదయం 7.00 గంటల నుంచి దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు.

## యువకుడి అదృశ్యం




రమేశ్ (ఫైల్)

మహదేవపూర్, అక్టోబర్ 21 : మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కమ్మల రమేశ్ (26) శుక్రవారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

## దుర్గామాతకు సీఎండీ గోపాల్‌రావు పూజలు

హనుమకొండ సబర్బన్, అక్టోబర్ 21 : దుర్గామాత దయతో వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తామని ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు అన్నారు. శనివారం నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేణుగోపాలస్వామి, శ్రీవత్సవాచార్యులు, డైరెక్టర్లు వెంకటేశ్వరరావు, గణపతి, సంధ్యారాణి, మోహన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ జనార్దన్, సీజీఎంలు సదర్‌లాల్, అశోక్‌కుమార్, మోహన్‌రావు, మధుసూదన్, కిషన్, రాజుచౌహన్, కేవన్ గుట్ట ప్రభాకర్, అశోక్, రవీంద్రనాథ్, రమేశ్ పాల్గొన్నారు.



ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో దుర్గా మాతకు పూజలు చేస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు